క్లుప్తంగా

దేవరమ్మ జాతర

కడియం: మాధవరాయుడుపాలెం గ్రామానికి చెందిన అన్నందేవుల వంశీకుల ఇలవేల్పు దేవరమ్మ జాతర ఆదివారం రాత్రి ఘనంగా జరిగింది. ప్రతి మూడేళ్లకోసారి ఈ జాతర నిర్వహిస్తారు. అన్నదేవుల వారి ఆడపడుచుగా దేవరమ్మ కొలుస్తూ జాతర, తీర్థ మహోత్సవాలను జరుపుతారు. గ్రామ సర్పంచ్ అన్నందేవుల చంటి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన అన్నందేవుల కుటుంబ సభ్యులు, ఆడపడుచులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అన్నదేవుల వీరభద్రరావు (చిన్నారి), నారాయణరావు (పెదబాబు) వీరాస్వామి నాయుడు, శ్రీరామచంద్రమూర్తి, ఎంపీటీసీ శ్రీను, మధు, దుర్గారావు, మల్లయ్య, రాయుడు, వెంకన్న, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు ఎనిమిది అర్జీలు

సీటీఆర్ఐ: స్పందన కార్యక్రమానికి వచ్చే అర్జీలను తక్షణమే పరిష్కరించాలని కోనేరు రంగారావు కమిటీ డివిజన్ తహసీల్దార్ సత్యనారాయణ రాజు అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఆర్డీవో తరఫున ఆయన పాల్గొని, ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పింఛన్, రెవెన్యూ, రైతు భరోసా మంజూరు తదితర వాటికి సంబంధించి ఎనిమిదిమంది అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట డిబ్లాకు కమ్యూనిటీ హాల్లో మ్యాజిక్ బస్ ఆధ్వర్యంలో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఆరోగ్యం విషయంతో తీసుకోవాల్సిన జాగ్రత్తలను, మహిళా చట్టాలను అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు వివరించారు. అనంతరం మ్యాజిక్ బస్ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌జీవో కె.మార్త తదితరులు పాల్గొన్నారు.

మంత్రి వేణు పరామర్శ

కడియం: మండలంలోని వీరవరం గ్రామానికి చెందిన బత్తుల బ్రహ్మనాయుడి మృతికి రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ సంతాపం తెలిపారు. ఆయన సోమవారం వీరవరంలోని బ్రహ్మనాయుడి స్వగృహానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. బత్తుల కుటుంబాన్ని పరామర్శించిన వారిలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు, పార్టీ నాయకుడు నక్కా రాజబాబు, జేసీఎస్ కన్వీనర్ తాడాల చక్రవర్తి, వేమగిరి, మురమండ, కడియపులంక సొసైటీల చైర్మన్లు వెలుగుబంటి అచ్యుతరామ్, తిరుమలశెట్టి శ్రీనివాసు, ఈదర దీన్‌దయాల్, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి వీరభద్రయ్య, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ ఈలి గోపాలం, దుళ్ల సర్పంచ్ కొండపల్లి పట్టియ్య, ఉప సర్పంచ్ తోకల శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు దాసరి శేషగిరి, సాపిరెడ్డి సూరిబాబు ఉన్నారు.

బావపై బావమరిది దాడి

కంబాలచెరువు: బావపై బావమరిది కత్తితో దాడి చేసిన ఘటనపై మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. వివరాల్లోకెళితే.. వీరభద్రపురానికి చెందిన పిల్లా దుర్గాప్రసాద్ తన భార్యతో గొడవ పడుతున్నాడు. దీంతో విషయాన్ని దుర్గాప్రసాద్ భార్య తన తమ్ముడు సాయికి ఫోన్ చేసి చెప్పింది. అతడు వచ్చి తన అక్కను ఎందుకు ఇబ్బందులకు గురిచేస్తున్నావంటూ దుర్గాప్రసాద్‌పై కత్తితో దాడి చేశాడు. ఈ క్రమంలో దుర్గాప్రసాద్‌కు గాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

350 మందికి వైద్యసేవలు

సీతానగరం: మండలంలోని రఘుదేవపురం సచివాలయం -1లో సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 350 మందికి పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు వైద్యసేవలు అందించారు. మంచంపై ఉన్న రోగుల ఇళ్లకు వెళ్లి వైద్యసేవలు అందించారు. చేతులు శుభ్రపర్చుకునే విధానం, దాని ఉపయోగాలను వివరించారు. అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ స్పందన, ఏఎన్ఎం వరలక్ష్మి, ఆశావర్కర్లు దుర్గ, కుమారి, సమీరా పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో మహిళల ప్రతిభ

సీతానగరం: మహిళలు అన్ని రంగాల్లో ప్రతిభ చూపుతూ ముందుకు దూసుకువెళుతున్నారని ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సింజెటా ప్రైవేట్ లిమిటెడ్, మహిళా మార్గదర్శి స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలైన మహిళలకు సోమవారం ముగ్గళ్ల సచివాలయంలో ఆమె బహుమతులు అందించారు. ఎంపీపీ జోత్స్న మాట్లాడుతూ తోటి మహిళల్లో వెలుగులు నింపుతూ భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సింజెంటా ప్రైవేటు లిమిటెడ్ జోనల్ ప్రొడక్షన్ మేనేజర్ ఆర్వీ నాయుడు, ఆర్గనైజర్ ఎం.సత్తిబాబు, ఎం.శ్రీనివాస్, మహిళా మార్గదర్శి సంస్థ కో ఆర్డినేటర్ మీనా పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి సీఎం జగన్ ప్రాధాన్యం

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి వేణు
- హెల్త్ క్లినిక్‌లు, ఓవర్‌హెడ్ ట్యాంకుల ప్రారంభం



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో మంత్రి వేణుగోపాలకృష్ణ

రాజమహేంద్రవరం రూరల్: ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి సీఎం జగన్ ప్రాధాన్యం ఇస్తున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌరసంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖలు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. కోలమూరు గ్రామ పంచాయతీ పరిధిలోని రూ.1.85 కోట్లతో నిర్మించిన మూడు వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, రెండు ఓవర్‌హెడ్ ట్యాంకులు, తాగునీటి పైపులైన్లను సోమవారం ఆయన ప్రారంభించారు. మంత్రి వేణు మాట్లాడుతూ ప్రజారోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తూ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ప్రారంభించిందన్నారు. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా 55 వేల మంది వైద్య సిబ్బందిని నియమించిందన్నారు. కోలమూరు పంచాయతీ పరిధిలోని 1, 2, 3 గ్రామ సచివాలయాల్లో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను, కొత్త కోలమూరు గ్రామంలో రూ.58.50 లక్షలతో 40 వేల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంక్‌ను, రాయుడుపాకలు గ్రామంలో రూ.63.90 లక్షలతో 90 వేల లీటర్ల సామర్థ్యం గల ఓవర్‌హెడ్ ట్యాంకును, తాగునీటి పైపులైన్లను, కుళాయిలను ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసబాబు, పంచాయతీరాజ్ ఏఈ సంపత్, పంచాయతీ కార్యదర్శి విజయారెడ్డి, సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, గృహసారథులు, సచివాలయ ఉద్యోగులు, ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో వంద మంది చేరిక

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్ సీపీతోనే అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని మంత్రి వేణుగోపాలకృష్ణ అన్నారు. బాలాజీపేట సెంటర్‌లోని కల్యాణ మండపంలో సోమవారం ప్రముఖ న్యాయవాది, వైఎస్సార్ సీపీ నాయకుడు గొందేశి శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో కాటం సుస్మిత, కాటం సుదర్శన్, గౌతమ్, స్టీఫెన్ తదితర సుమారు వంద మంది వైఎస్సార్ సీపీలో చేరారు. వారందరికీ మంత్రి వేణు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరు రూరల్ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగుర వేసేలా కృషి చేయాలని మంత్రి వేణు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ నక్కా రాజబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరిజాల వీర్రాజు(బాబు), మాజీ కార్పొరేటర్ మిరపల శ్యామలరావు, పార్టీ నాయకులు చాపా రాజా, కుడిపూడి గిరి, దమ్ము ప్రసాద్, ప్రకాష్, కొల్లుదీపు, కర్రి రాజేష్ పాల్గొన్నారు.

నేదునూరి సేవలు చిరస్మరణీయం



గంగాధరం విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న ప్రముఖులు

ప్రకాశం నగర్: నేదునూరి గంగాధరం సేవలు చిరస్మరణీయమని హితకారిణి పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు చీర్ల సీతారామ నాయుడు అన్నారు. స్థానిక లక్ష్మీవారపుపేటలో సోమవారం నేదునూరి వర్ధంతి సభ నిర్వహించారు. సీతారామ నాయుడు ముఖ్య అతిథిగా హాజరై, గంగాధరం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ అద్భుత మౌఖిక సాహిత్యాన్ని ఒక దరి చేర్చి గోదావరి ప్రాంత సమీపంలో నిక్షిప్తం చేయడం ప్రతి తెలుగువాడు గర్వించదగిన విషయమన్నారు. సభకు కృష్ణ శర్మ అధ్యక్షత వహించారు. ఎస్‌కేవీటీ అధ్యాపకురాలు పద్మజ పాల్గొన్నారు.

పీఎఫ్ ఆఫీస్ వద్ద విశ్రాంత ఉద్యోగుల ధర్నా



ధర్నా చేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

రాజమహేంద్రవరం రూరల్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గత ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు విశ్రాంత ఉద్యోగులకు రూ.9 వేలు పింఛన్ ఇవ్వాలని కోరుతూ రాజమహేంద్రవరం పీఎఫ్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు, సివిల్ సప్లయిస్ విశ్రాంత ఉద్యోగులు, తణుకు అక్కమాంబ టెక్స్‌టైల్స్ విశ్రాంత ఉద్యోగులు తదితర సుమారు 175 మంది ఈ ధర్నాలో పాల్గొన్నారు. విశ్రాంత ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను అమలు చేయాలన్నారు. విశ్రాంత ఆర్టీసీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రీజినల్ ప్రెసిడెంట్ యర్రంశెట్టి కొండలరావు మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులు చాలీచాలని పింఛన్ సొమ్ముతో ఇబ్బంది పడుతున్నారన్నారు. అనంతరం రీజినల్ పీఎఫ్ ఆఫీసర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సత్తిబాబు, బీబీకే రావు, మంగరాజు, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రతి సామాజిక వర్గానికి కమ్యూనిటీ హాలు

- ఎంపీ, సిటీ కోఆర్డినేటర్ భరత్‌రామ్
- పద్మశాలీ కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన



పద్మశాలీ కమ్యూనిటీ హాలు శంకుస్థాపన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్, చిత్రంలో మార్గాని నాగేశ్వరరావు తదితరులు



వైఎస్సార్ సీపీలో చేరిన మహిళలతో ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: సామాజిక భవనం అనేది ఆ కులస్తుల ఐక్యతకు ప్రతిరూపమని, ప్రతి కులానికి తప్పనిసరిగా ఒక కమ్యూనిటీ హాలు నిర్మిస్తామని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ మార్గాని భరత్ రామ్ అన్నారు. స్థానిక 45వ డివిజన్ లూథరగిరి చర్చి, వాంబే గృహాల వద్ద సోమవారం పద్మశాలీ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ నగరంలో కమ్యూనిటీ హాలు కోసం రెండున్నర దశాబ్దాలుగా పద్మశాలీలు ఎదురు చూస్తున్నారన్నారు. ఇటీవల పద్మశాలీలు వన సమారాధనకు ఆహ్వానించి కమ్యూనిటీ హాలు కావాలని కోరగానే, ముందు భవన నిర్మాణానికి నిధులు సమకూర్చుకుంటే తప్పనిసరిగా స్థలం మంజూరు చేసే బాధ్యత తనదని హామీ ఇచ్చానన్నారు. తాను సూచించిన విధంగా రూ.50 లక్షలు సేకరించడం హర్షణీయమన్నారు. తన ఎంపీ నిధుల నుంచి రూ.20 లక్షలు అందజేస్తానని ప్రకటించారు. సుమారు రూ.3 కోట్లు విలువైన 15 సెంట్ల స్థలాన్ని కలెక్టర్ ద్వారా మంజూరు చేయించినట్టు తెలిపారు. ఎటువంటి జాప్యం చేయకుండా నిర్మాణ పనులు ప్రారంభిస్తే సంవత్సరంలో అద్భుతమైన కమ్యూనిటీ హాలు తయారవుతుందన్నారు. మీ అందరి ఆశీసులు, మద్దతు ఉంటే ఎమ్మెల్యేగా నేనే వచ్చి ఈ భవనాన్ని ప్రారంభిస్తానన్నారు. కార్యక్రమంలో బీసీ జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఇన్ చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, కొస్సే రాజేష్, ఆంజనేయ గురుస్వామి, సప్ప దుర్గాప్రసాద్, పద్మశాలీ సంఘం అధ్యక్షుడు యర్రమోతు ధర్మరాజు, జమిచెట్టి గాంధీ, సప్పా ఆదినారాయణ పాల్గొన్నారు.

పేదలకు వరం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ

పేదల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా సీఎం జగనన్న అర్హులైన వారందరికీ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా హెల్త్ కార్డులు అందజేస్తున్నారని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ మార్గాని భరత్ రామ్ తెలిపారు. సోమవారం నగరంలోని 28వ డివిజన్ ఇన్ చార్జి బిల్డర్ చిన్న ఆధ్వర్యంలో హెల్త్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భరత్ రామ్ మాట్లాడుతూ ఈ హెల్త్ కార్డుతో ఒక్క మన రాష్ట్రంలోనే కాదు, దేశ వ్యాప్తంగా గుర్తించిన ఆసుపత్రులలో రూ.25 లక్షలు వరకూ వైద్య సేవలు ఉచితంగా పొందవచ్చునన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అంటే పేదల ప్రభుత్వమన్నారు. జగనన్న అంటే ఒక నమ్మకం, ఒక భరోసా అని తెలిపారు. నగరంలో అభివృద్ధి జరిగిందని అనుకుంటే తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పిల్లి శ్రీను, స్వరూప్, బిల్డర్ చిన్న సంయుక్త ఆధ్వర్యంలో పలువురు టీడీపీ, జనసేన నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. వీరందరికీ పార్టీ కండువాలు కప్పి ఎంపీ భరత్‌రామ్ సాదరంగా ఆహ్వానించారు.

పారిశుధ్యం మెరుగుకు మరింత కృషి

- మంత్రి వేణుగోపాలకృష్ణ
- డ్రైనేజీలు, అంతర్గత రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన



మ్యాన్‌హోల్ వద్ద ప్రమాదాలు జరగకుండా హెచ్చరిక ఏర్పాటు చేస్తున్న మంత్రి వేణు



మంత్రి వేణు ఆదేశాలపై కల్వర్టు పనులు చేపట్టిన కార్మికులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): నియోజకవర్గంలో పారిశుధ్యాన్ని మరింత మెరుగుపరిచేందుకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖలు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రూరల్ కో ఆర్డినేటర్ చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే రూ.10 కోట్లతో పనులు చేపట్టడం జరిగిందన్నారు. అమృత్ ద్వారా మరో రూ.18 కోట్లతో డ్రైనేజీ, తాగునీటి వసతుల కోసం అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. కార్పొరేషన్ పరిధిలోని ఎనిమిది డివిజన్లలో రూ.4.88 కోట్లతో నిర్మించే పలు డ్రైనేజీలు, అంతర్గత రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో నగరపాలకసంస్థ ఈఈ శేషగిరిరావు, డీఈ ప్రకాశరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి మింది నాగేంద్ర, మాజీ వైస్ ఎంపీపీ నక్కా రాజబాబు, జేసీఎస్ కన్వీనర్ కొప్పినీడి ప్రసాద్ బాబు (రాజమౌళి), సచివాలయ కన్వీనర్లు అంగాడి సత్యప్రియ, చీకురుమిల్లి చిన్న, దుంపాచంద్రారెడ్డి, నెల్లి సర్వేశ్వరరావు, పడమటి కామరాజు, బిల్డర్ చిన్న, ఇమామ్, చాపా రాజా, రాంకీ, కుడిపూడి గిరి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

మంత్రి వేణు శంకుస్థాపన చేసిన పనులు

- 17వ డివిజన్‌లోని షిర్డీసాయి నగర్ ఒకటో వీధిలో రూ.40 లక్షలతో సీసీ రోడ్డు, అంబికా నగర్, సాయికృష్ణ నగర్ మెయిన్ రోడ్డులో రూ.68 లక్షలతో బీటీ రోడ్డు పునరుద్ధరణ, బెర్మ్‌ల అభివృద్ధి
- 17 డివిజన్ రైల్వే ట్రాక్‌ల పక్కన ఐఎల్‌టీడీ ఫ్లైఓవర్ నుంచి ఐటీసీఎల్ వరకూ రూ.50 లక్షలతో స్టోమ్ వాటర్ డ్రైనేజీ నిర్మాణం
- 19వ డివిజన్‌లోని కొండవారి స్ట్రీట్‌లోని వివిధ వీధుల్లో రూ.10 లక్షలతో సీసీ డ్రైనేజీలకు మరమ్మత్తులు
- 20వ డివిజన్ నిడమర్తివారి వీధి, కంకటాలవారి వీధి, ఓరుగంటివారి వీధి, హోటవారి వీధుల్లో రూ.77.60 లక్షలతో సీసీ రోడ్లు
- 28వ డివిజన్‌లోని భారత్ బొమ్మలు వీధి సమీపంలో ఆర్‌సీసీ తుపాను నీటి కాలువ రూ.47 లక్షలతో నిర్మాణం
- 16వ డివిజన్ ఆదర్శ నగర్‌లో రూ.1.09 కోట్లతో అంతర్గత రహదారులు, సీసీ రోడ్లు, రూ.55 లక్షలతో ఆవ వాంబే ఇళ్లకు ఆర్‌సీసీ డ్రైనేజీ, కవర్ శ్లాబ్‌ల నిర్మాణం
- బీటీ రోడ్డు నుంచి ఈస్ట్ రైల్వే స్టేషన్ బుకింగ్ కార్యాలయం మీదుగా బాలాజీపేట రహదారికి రూ.32 లక్షలతో పునరుద్ధరణ పనులు

మంత్రి వేణు చొరవతో మ్యాన్‌హోల్‌కు మోక్షం

మంత్రి వేణుగోపాలకృష్ణ చొరవతో ఐఎల్‌టీడీ సెంటర్ – రైతుబజార్‌లకు మధ్య కల్వర్టుపై ఉన్న మ్యాన్‌హోల్‌కు మోక్షం లభించింది. వివరాల్లోకి వెళితే.. 17వ డివిజన్ పర్యటనలో ఉన్న మంత్రి ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోల్‌ను చూశారు. వెంటనే దానిని పరిశీలించి త్వరితగతిన నిర్మాణం చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. అలాగే ఎవ్వరూ ప్రమాదం బారిన పడకుండా అక్కడ హెచ్చరిక ఏర్పాటు చేశారు. అయితే మ్యాన్ హోల్ కింద ఉన్న కల్వర్టు శిథిలావస్థకు చేరుకోవడంతో ఇలా జరుగుతుందని మంత్రి గమనించారు. వెంటనే మ్యాన్‌హోల్ పనులు పూర్తి చేయాలని నగరపాలకసంస్థ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశాలు జారీ చేశారు. దీంతో సోమవారం మధ్యాహ్నం నుంచి ఇంజినీరింగ్ అధికారులు కల్వర్టు పనులు ప్రారంభించడం జరిగింది. దీంతో మంత్రి వేణును స్థానికులు అభినందిస్తున్నారు.

విద్యాహక్కు చట్టంపై అవగాహన కల్పించాలి



డీఈవో కార్యాలయాన్ని పరిశీలిస్తున్న ఆర్‌టీఈ యాక్ట్ రాష్ట్ర నోడల్ అధికారి మధుసూదనరావు తదితరులు

కంబాలచెరువు: విద్యాహక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించి, ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాల సంఖ్య పెరిగేలా చూడాలని ఆర్‌టీఈ యాక్ట్ రాష్ట్ర నోడల్ అధికారి డి.మధుసూదనరావు విద్యాశాఖాధికారులను ఆదేశించారు. స్థానిక కోటగుమ్మం సమీపంలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సోమవారం జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వ విద్యా హక్కు చట్టంలోని సెక్షన్ 12(1) సీ ప్రకారం ఆర్థికంగా వెనుకబడిన వర్గాల పిల్లలకు ప్రైవేట్ విద్యాసంస్థల్లో సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. దీనికి సంబంధించి ఈ నెల 25వ తేదీ వరకూ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు సమయం ఉందన్నారు. ఈ అంశంపై జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు, ఎస్ఎస్ఏ పీవో ఎస్.సుభాషిణి, రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఈవీబీఎన్ నారాయణ, అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్‌లు పత్రికా ప్రకటనల ద్వారా ప్రచారం చేశారన్నారు. డీఈవో కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు, సమగ్ర శిక్షా ఏఎల్ఎస్ కో ఆర్డినేటర్ ఎస్తేరురాణి, ఎంఐఎస్ కో ఆర్డినేటర్ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులకు అండగా ఆదిరెడ్డి వాసు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పాలిక శ్రీను

రాజమహేంద్రవరం సిటీ: టీడీపీ, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిరెడ్డి వాసు ప్రశాంతమైన రాజమహేంద్రవరంలో అసాంఘిక శక్తులను ప్రోత్సహిస్తున్నారని రాష్ట్ర గౌడ, శెట్టిబలిజ, ఈడిగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాలిక శ్రీనివాస్ ధ్వజమెత్తారు. సోమవారం ఎంపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదిరెడ్డి వాసు పెంచి పోషిస్తున్న బ్లేడ్‌బ్యాచ్‌లు,గంజాయి బ్యాచ్‌లు, రౌడీ షీటర్లు నగరంలో అలజడులు సృష్టిస్తున్నారన్నారు. ఆయనంటే అసాంఘిక శక్తులకు అభయమని, నగర వాసులకు మాత్రం భయమని ధ్వజమెత్తారు. నగరంలో ఎంపీ భరత్ చేస్తున్న అభివృద్ధి చూసి ఓర్వలేకే వాసు నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారన్నారు. ప్రతి పనిలో కమీషన్లు తీసుకునే సంస్కృతి ఆదిరెడ్డి కుటుంబానిదేనన్నారు. రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా మార్గాని భరత్‌రామ్‌ను అఖండ మెజారిటీతో గెలిపించేందుకు ఓటర్లు సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో జిల్లా వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు ఆరిఫ్, డాక్టర్ సింగంపల్లి కార్తిక్, గడ్డి శ్రీను, బాషా, తిరగాటి దుర్గ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నెలవంక రాకతో రంజాన్ మాసం ప్రారంభం



నగరంలో సోమవారం రాత్రి నెలవంకను చూస్తున్న ముస్లింలు

సీటీఆర్ఐ: రాజమహేంద్రవరంలో సోమవారం రాత్రి 6.28 గంటలకు నెలవంక కనిపించింది. దీనితో రంజాన్ మాసం ప్రారంభమైనట్లు ముస్లిం ప్రతినిధులు వెల్లడించారు. మంగళవారం ఉదయం నుంచి ఉపవాస దీక్షలు ప్రారంభమవుతాయి. రంజాన్ ముస్లింలకు పవిత్ర మాసం. ఈనెలలో కఠిన నియమాలను పాటిస్తారు. ఈనెలలోనే సర్వమానవాళి కోసం దివ్య ఖుర్‌ఆన్ అవతరించింది. రంజాన్ అంటే ఒక నెల పేరు. ఇస్లామిక్ క్యాలెండరు ప్రకారం తొమ్మిదో నెలగా వస్తుంది. ఈనెలలో ముస్లింలు ఉపవాసాలు పాటిస్తూ తమను తాము సంస్కరించుకుంటూరు. అల్లాపై విధేయతను ప్రకటిస్తూ, అల్లా విధించిన కట్టుబాట్లను ఆచరిస్తూ క్రమశిక్షణాయుత జీవితాన్ని గడుపుతారు. ఉపవాసం మనలో ఉన్న మాలిన్యాన్ని కడిగేయడానికి ప్రయత్నిస్తుంది. చెడుకు దూరం చేసి సత్ప్రవర్తనవైపు నడిపిస్తుంది.

ఏరువాక అధికారుల పర్యటన



వరిపంటను పరిశీలిస్తున్న ఏరువాక అధికారులు

రాజానగరం: ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం, జిల్లా వ్యవసాయ సాంకేతిక సలహా కేంద్రం దివాన్ చెరువులోని ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహరావు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.అచ్యుత్ రాజు సోమవారం రాజానగరం, కడియం, అనపర్తి మండలాల్లో పర్యటించి పంటలను పరిశీలించారు. ఈ ప్రాంతాలలో ప్రస్తుతం వరి పంట ఈనిక దశ నుంచి గింజలు తొడిగే దశలో ఉందని, చీడపీడల బెడద పెద్దగా లేదని డాక్టర్ నరసింహరావు తెలిపారు. అయితే అక్కడక్కడా కాండం తొలిచే పురుగు, ఆకుముడత పురుగులను గమనించామని, వీటి నివారణకు కార్టప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాములు లేదా క్లోరంట్రనిలిప్రోల్ 0.3 మి.లీలను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కడియం పరిసర ప్రాంతాలలో వరి పంట తరువాత బంతి సాగుచేసే రైతులతో కూడా లాభసాటి పంటల గురించి ముచ్చటించామన్నారు. మిరప, బెండ సాగులను కూడా పరిశీలించి, రైతులకు సలహాలిచ్చామన్నారు.ఆయా మండలాలకు చెందిన వ్యవసాయాధికారులు, గ్రామ సహాయకులు కూడా పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టర్లకు సత్కారం



హేమశ్రీ, తరంగిణిలను సన్మానిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

రాజానగరం: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా దివాన్ చెరువులోని డాక్టర్ సుంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ (అండర్ 17)పోటీల్లో బంగారు, వెండి పతకాలు సాధించిన అక్కాచెల్లెళ్లు హేమశ్రీ, తరంగిణిలను సోమవారం ఘనంగా సన్మానించారు. ఫౌండేషన్ చైర్మన్ సుంకర వెంకటేశ్వరరావు వారికి బహుమతిగా రూ.20 వేలు అందజేశారు. అలాగే మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఆటలు, పాటల పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

16న 'నన్నయ'లో కుసుమ ధర్మన్న జయంతి



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య పద్మరాజు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఈనెల 16వ తేదీన మహాకవి కుసుమ ధర్మన్న 125వ జయంత్యుత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్లను సోమవారం వీసీ ఆచార్య కె.పద్మరాజు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఆదికవి నన్నయ యూనివర్సిటీ, కుసుమ ధర్మన్న కళాపీఠం (హైదరాబాద్) సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు శాఖ నిర్వహించే ఈ కార్యక్రమంలో కవి సమ్మేళనం నిర్వహణ, కుసుమ ధర్మన్న సాహితీ పురస్కారాలు ప్రదానోత్సవం జరుగుతుందన్నారు. 30 మంది అధ్యాపకులు పరిశోధనా పత్రాలను సమర్పిస్తారన్నారు. కుసుమ ధర్మన్న సాహితీ ప్రస్థానం - సామాజిక సేవ అనే అంశంపై 53 మంది కవులు కవితలు వినిపిస్తారన్నారు. డాక్టర్ తరపట్ల సత్యనారాయణ కన్వీనర్‌గా వ్యవహరించే ఈ సదస్సుకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ రెక్టార్ ఆచార్య పి.వరప్రసాద్ మూర్తి, కుసుమ ధర్మన్న కళాపీఠం అధ్యక్షురాలు డాక్టర్ రాధా కుసుమ, మద్రాస్ యూనివర్సిటీ తెలుగు శాఖాధిపతి ఆచార్య విస్తాలి శంకర్, ఏయూ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బూసి వెంకటస్వామి, వీఎస్ఎం కళాశాల తెలుగు శాఖాధిపతి డాక్టర్ ర్యాలి శ్రీనివాస్, కందుకూరి వీరేశలింగం కళాశాల తెలుగు శాఖాధిపతి డాక్టర్ పీవీబీ సంజీవరావు హాజరవుతారన్నారు.